# ప్రణయసాఫల్యం

ఎస్. ఉమామహేశ్వరరావు



"వచ్చి ప్రశాంతంగా చిన్న సహాయం చేసి పెట్టాలి రవి! అడగలేక మొహమాట పడుతున్నాను" అంటూ మధు నవ్వాడు.

"నేను చేయగలిగిందైతే తప్పక చేస్తాను"

"చేయగలిగిందేలే! కూర్చో మొత్తం చెప్తాను"

రవి కూర్చొని ప్రశాంతంగా ముఖంలోకి చూచే సరికి అతను తల వంచుకున్నాడు.

"... మావాడు ఓ అమ్మాయిని ప్రేమిస్తున్నాడు. సినిమా ప్రేమికుల్లానో యాక్సిడెంట్లోనో కళ్ళు కళ్ళు కలుసుకోవడం, సైగలతో మాట్లాడుకోవడం, ఏకాంతంగా పార్కుల్లో కలుసుకోవడం లాంటివి జరుగలేదు. ఎన్నో ప్రేమలేఖలు రాశాడు. కొన్ని కుదిరాయి కొన్ని కుదరలేదు. మొత్తానికేవీ పంపలేదు. యివ్వలేదు తన అభిప్రాయం ఆమెకు తెలుపనేలేదు మొదటిలేఖ చూడగానే కాదు చదవగానే ఆ అమ్మాయి యెంతగా ప్రేమించేలా వుండాలని డిస్ చేసేలా లేఖ వ్రాయలేక చస్తున్నాడు. నువ్వు రచయితవు గదా! ఆకర్షవంతంగా వుత్తరం రాసిపెట్టగలవేమోనని ... ..." చెప్పడం ఆపాడు మధు.

రవి ఆలోచనలో పడ్డాడు తాను రాయగలడు ఆకర్షించబడేలా చేయగలడు. కానీ ప్రశాంతం వుత్తమ తరగతికి చెందిన ప్రేమికుడేనా? అతని ప్రేమలో మోసం లేదు గదా!

"నిజంగా ప్రేమిస్తున్నాడా?.." అడిగాడు

"నేను సర్టిఫై చేయగలను" హామీ యిచ్చాడు మధు

"ఎందుకు ప్రేమిస్తున్నారు? ఎలా ప్రేమిస్తున్నారు?" ప్రశాంతంనే అడిగాడు రవి.

"నిజం చెప్తున్నానండీ! లేఖలో ప్రేమామృతాన్ని చిలికిస్తూ హృదయంలో హాలా హలాన్ని వుంచుకోడం లేదు. మీరు నమ్మాలి ఆమెగాడు వాడు నవ్వాడు. వివాహం చేసుకోవాలనుకుంటున్నాను. ఇద్దరి కులాలు వకటే అమ్మాయి మనస్సు తెలుసుకుంటె పెద్దల ద్వారా సంప్రదింపజేస్తాను. ఆమె మనస్సు తెలుసుకునే వుపాయం..."

అతని మాటల ద్వారా ముఖకవళికల ద్వారా అతన్ని అర్థం చేసుకున్నాడు రవి. బాగా అర్థం చేసుకున్నాడు అనే దానికి వీలులేదు. ఎందుకంటే వాళ్ళ పరిచయ కాలం కనీసం ఐదు నిముషాలను మించక పోవడము.

నిజానికి ప్రేమించడం రవి దృష్టిలో తప్పుకాదు ఆ హక్కు ప్రతి ప్రాణికి వుంది. అయితే అసభ్యంగా, అసహ్యంగా, బూటకంగా ప్రేమించడాన్ని అతను నిరసిస్తాడు. అవతలివారి మనస్సు తెలుసుకోకుండా ప్రేమలు పెంచుకోవడమూ వలించనప్పుడు మజ్నూలు, దేవదాసులుగా రూపొందడం అవివేకమైన విషయం అని అభిప్రాయపడేవాడు.

ప్రేమించారే అనుకో ప్రేమల్ని పెంచుకోక ముందే యేదోవిధంగా ప్రయత్నించి త్వరలో అవతలివారి మనస్సు తెలుసుకోవడం సమంజసమైన విషయము. అవతలినుంచి ఫలితం నిరాశజనకంగనూ వ్యతిరిక్తంగనూవస్తే ప్రేమను 'విత్‌డ్రా' చేసుకోవడం సులభం. జీవితంలో ప్రేమఒకభాగం. ప్రేమే జీవితంగాదు. అనేపంథాల్లో సాగేవి అవి అయిన అతని రచనలు.

"మీరు పవిత్రంగానే ప్రేమిస్తున్నారా?" మళ్ళీ అడిగాడు రవి

ప్రశాంతం ప్రేమే పవిత్రమైందైతే సహాయపడాలనే నిర్ణయానికి వచ్చాడు రవి

"భగవంతునిసాక్షిగా చెప్తున్నాను... నన్ను నమ్మండి!"

మీ ప్రేమను ఆమె తిరస్కరిస్తే?"

అతనిముఖంలో నిరాశ ప్రస్ఫుటించింది.

"ప్రాప్తంలేదు. దురదృష్టవంతుణ్ణి అనుకుంటాను.

"పిచ్చివాళ్ళయిపోవడమో లేక గ్రంధిలు కావడమో చేయరు గదా!"

ఎంతమాత్రం!......"

"సరే! నేను తర్వాత రాసిస్తాను. మీ ప్రేమ ఫలించాలని భగవంతుణ్ని ప్రార్థిస్తాను. ఓ విషయం చెప్పండి! ఆమెలో మిమ్మల్ని అమితంగా ఆకర్షించిన గుణమేమిటి?... ఎందుకంటే ఎంతటిస్త్రీకైనా ఆమెలోవున్న ఓ సుగుణాన్ని లేదా లేని ఓ సుగుణాన్ని ఆపాదించి మెచ్చుకుంటూ

పదేపదేపొగుడ్తూ ఆ గుణమే ఆమెలో లేకపోతే కానిలా ఆకర్షింపబడేవాణ్నికాను అంటేచాలు చాలా వరకు లొంగిపోతారు. ఆ లేనిగుణాన్ని కలిగించు కుంటారు కూడా... సైకలాజికల్ గా స్త్రీలల్లో చాలామందికి యీ బలహీనత వుంటుంది .."

చెప్తాను ఆమెగారు చాలా చలాకీగా వుంటారు. ఎప్పుడూ నవ్వుతూ తుళ్ళుతూ హాయిగా వుంటారు. ఏదో ఫ్యామిలీతో బిగ్రెన్స్ వున్నాయని అంటారు. కాని యే మాత్రం ఫీలింగ్ చూపెట్టదు నేను అందమైనదాన్ని. చదువుతున్నదాన్ని అనే గర్వంతో వ్యవహరించదు. ఆమె మన స్తత్వం అవగాహన చేసుకోలేనివారు, తొలిసారిగా ఆమెను గమనించిన వారు ఆమె ప్రవర్తన మంచిది కాదంటారు. ఎవరితోనైనా యిట్టే పరిచయం చేసుకుంటుంది. స్త్రీ పురుష తారతమ్యంతో వ్యవహరించదు హృదయ శుద్ధి గలది... నిజం చెప్పాలంటే యెంతో నాగరికంగా అలంకరించు కుంటుంది. ఉన్న అందానికి వన్నెలు కల్పించు కుంటుంది. ఆమె వెంట సరదాలు. సందడీలు పండుగలు వుంటాయి... చెప్పాలంటే చాలా వున్నాయి... యివి చాలా యింకా చెప్పమంటారా?"

'చాలు" అన్నాడు రవి.

సామాన్యంగా యిలాంటి తత్వం గలవారిని ప్రేమించే వాళ్ళ హృదయ విస్తీరణం యెక్కువగా వుంటుంది. లేకపో విచ్చలవిడిగా వ్యవహరించే స్త్రీలను భరించగలరా! వాళ్ళను సహించగలరా?

"ఇంతకూ ఆమెగారి పేరూ!" రవి అడిగాడు

"ఎక్స్ అని వ్రాయండి."

రవి మధులు కలసి నవ్వారు.

"...అయితే మీరు ఆమెను బాగా స్టడీ చేసారన్నమాట రవి అడిగాడు "అవునండీ! ఆమెను చూడందే వుండలేను. కాలేజికి రాకపోకలు సాగించేటప్పుడు ఆమెకు తెలియకుండానే అనుసరిస్తాను. నాకే వింతగా తోస్తుంది. యేవిటీ బాడీ గార్డ్ పనని ఆమె నడక నవ్వు ఒకటేవిటి ప్రతి కదలికా ఆకర్షణీయంగా వుంటుంది... ఓ సారి ఆమె చెప్పు తెగి పోయింది కాబోలు ఒక్కటే చెప్పల్‌స్టోర్ కెళ్ళి రిపేరు చేయించుకుంటూ వుంటుంది... నేనూ చెప్పల్స్ కోసమే వెళ్ళాను. నా ప్రేమైన దేవతను అంతవరకూ యెన్నడూ చూడక పోవడతో తబ్బిబ్బయ్యాను... ఆమెగారు బిడియం యేమీలేక సరదాగా మాట్లాడారు, నన్ను పలుకరించి చదువు పేరూ వగైరాలు అడిగారు.

ఇంట్లో ఎవరి ద్వారా నైనా ఆ తెగిపోయిన చెప్పుని పంపించకూడదా? మీరే రావాలా అని అడిగాను - దానికేమైందో తెలుసా? ఇదినాపనండీ వేరొకరిచేత చేయించుకోవడం నా కయిష్టం అంతే కాక నా పని నేను చేసుకోవడంలో లభించే తృప్త్యానందాలు యితరత్రా లభించవు. నేనైతే నాకు నచ్చిన విధంగా నా కోరికలు నెరవేర్చు కుంటాను. అన్నారు.

యాజమాన్యం వహించాలని అడ్డదిడ్డమైన పనులు చెప్పి చేయించుకుంటారేగానీ యిలా తమ కాళ్ళపై స్వయంగా నిల్చొనే మన స్తత్వం యెందరి కుంటుంది చెప్పండి. అంతసేపు మాట్లాడినా అధిక ప్రసంగి అనిపించ లేదు" ప్రభాకరం యెంతో సంతోషంగా చెప్పాడు.

'భవిష్యత్తులో ఆమె మీద మీకు ..

"ఇక్కడే చాలామంది పొరబడు తుంటారు. ముద్దుల్లావుంటూ అమాయకతను నటిస్తూన్న అబలల్లాంటి ఆమెగారి యిద్దరు స్నేహితురాండ్రు పగలు కాకి అరుపుకు భయపడి రాత్రి యమునా నదిలోని మొసళ్ళను దాటుకుంటూ వెళ్ళేరకాలు. ఈమెగారు తామరాకుపైని నీటిబిందువులా వుంటారు."

'అరరే. యింత మాత్రం వుపమానాలు చెప్పగలిగే మీరు...యింత చక్కగా ఆమెను గురించి వివరించిన మీరు స్వయంగా లేఖ రాయగలరే!"

ఏదో! ఇంకు, స్వవిషయం గదండి! ఓడాక్టర్ తమ యింటిలోని వారికి వైద్యం యితరులకు చేసినట్లు చేయలేదంటారు మరో డాక్టరు సలహా పొందుతాడంటారు అదే ఫీలింగ్

"చూడండీ ప్రేమలేఖ అనగానే యేదోలా వుండాలని. శుద్ధ గ్రాంధిక భాషతో ప్రబంధాల శైలిలో వుండాలని యెక్కడా లేదు. యింకా హృదయేశ్వరీ, ప్రాణేశ్వరీ అనే సంబోధనలూ అక్కరలేదు. అలా రాశామంటే అతిశయోక్తిగా వుండడమేగాక "అబ్బో కవిత్వమే అనే హేళనకు గురవుతారు అందుకని భాషమాత్రం సాధారణంగా వుండాలి భావాలు మాత్రం అసాధారణంగా వుండాలి. ఎందుకు చెప్తున్నానంటే ప్రతిసారి నేను రాసిపెట్టడం జరగదు గదా! మీ దగ్గరుంటే ఓ లెటర్ యివ్వండి! చూస్తాను! మరేంలేదు మీ శైలి యెలావుంటుందోనని! అభ్యర్థించాడు రవి.

ప్రభాకరం పూర్తిగా లజ్జ పడ్డాడో సంశయిస్తున్నాడో రవి అర్థం చేసుకోలేకపోయాడు.

'ఇంకో విషయం! మీ వుత్తరం చూడగనే ఆగ్రహించి పెద్దలకు చెప్పి అల్లరి పెట్టించాలని చూస్తే!"

"నో! నో. ఆమె తత్వం అదికాదు—యిష్టం లేదు అని నిక్కచ్చిగా చెప్పివేయగలదు"

"ఆమె మీద నమ్మకం యెప్పటికీ చెడదని నేనూ నిర్ణయించు కుంటున్నాను..." అని రెండు నిముషాలు ఆలోచించి పిదప యిలా అన్నాడు.

'మీరు నాకు బాగా నచ్చారండీ! మీరు ఆశించిన విధంగా చక్కగా లేఖరాసి పెడ్తాను మరి మీ ప్రేమ ఫలిస్తే..."

"మంచి పార్టీ యిస్తాను..."

నవ్వాడు రవి—"నా ప్రణయ సారథ్యంలో మీరు విజయులైతే చాలులెండి! ఇరువురి ప్రేమికులను దగ్గర చేర్చాననే తృప్త్యానందాలు నాకుంటాయి"

తన మాటలకు సిగ్గుపడుతున్న ప్రభాకరంను బాగా పరిశీలించి 'అందమైన వాడే!' మంచి వాడులా వున్నాడు యింతకూ ఆ అమ్మాయికి యితనిపై అభిప్రాయంవుందో లేదో, కాస్తయిన వుంటే తన వుత్తరం పనిచేస్తుంది...చూద్దాం! అనుకున్నాడు రవి.

'ఒక గంటలో రాసి పెట్టగలరా?" ప్రభాకరం అడిగాడు.

"రాసిచ్చే వెళ్తాను. రేపుదయంవచ్చి మధునడిగి తీసుకు వెళ్ళండి!" రవి అన్నాడు.

"అలాగే!...వస్తాను. వస్తానండి" ప్రభాకరం చిరునవ్వుతో నిష్క్రమించాడు.

ప్రభాకరం స్వంత వూరు నెల్లూరే. అతనికి తల్లి, దండ్రీ యిల్లు అన్నీ వున్నాయి మధు చదువు నిమిత్తం నెల్లూర్లో రూం తీసుకోవలసి వచ్చింది. మధు, రవిలది నెలూరుకు సమీపంలోని రామాయపట్నం స్వగ్రామము.

'ఏమిట్రా సంగతి మధు! సదుద్దేశంతోనే ప్రేమిస్తున్నాడా?" అడిగాడు రవి.

"సెంట్ పర్సెంట్! ఆ అమ్మాయికి యిలాంటి వాడు భర్తయితే సుఖపడిపోతుంది' తలవంచుకొని చెప్పాడు మధు

"అయితే తప్పక రాస్తాను. ఏదో పుణ్యంకూడా కాస్తా దక్కుతుంది...ఓ పేపర్ యిలా యివ్వు" అంటూ చేయి చాపాడు రవి.

* * *

"ఇదో రవీ! వసు నిన్ను గురించి చాలా సార్లు అడిగింది...మేడమీదవుంది..." సరస్వతమ్మ రవి యింట్లోకి రావడంతోనే చెప్పింది.

ఏమిటో విశేషం!' అంటూ మెట్లెక్కసాగాడు.

రవికి సరస్వతమ్మ మేనత్త వసు వరసవుతుంది. కాని రవి వసూను వివాహం చేసుకోను అది నాకంటే చాలా చిన్నది. పైగా ఆభావంతో నేనప్పుడు చూడలేదన్నాడు. వేరే వివాహం చేసుకున్నాడు కూడా. ఇప్పుడు యిద్దరు పిల్లలు కూడా!

"అబ్బ! కబ్బుకాయలు కాచాయిబావా!" అందమైన వసూ అంది రవిని చూడగానే.

"మరి పండ్లయ్యేదెప్పుడో?" అంటూ నవ్వి ఆమెయెదురుగా కూర్చున్నాడు.

"నేను కాలేజీకి వెళ్ళినప్పుడే వచ్చావంట రెండు సార్లు ...ఫ్రండ్స్ రూంలకెళ్ళకపోతే పడుకోనన్న యింటికి రాకూడదు!"

"ఈసారి అన్నావుగా! యికవస్తాలే! ఏవిటీ విశేషం?"

"మరేంలేదు బావ! కాస్త సహాయం చేసి పెట్టాలి. ఎట్లయిన రచయితవు గదూ! నీ హృదయం గ్లోబంత వుంటుందనే నమ్మకంతో అడుగుతున్నాను" అంది.

"సర్లే! విషయం చెప్పు!"

"ఏం లేదు బావా; నిన్నె పుదయం... కాలేజీ యెడ్రసుకు ఓ వుత్తరం వచ్చింది... ..." సిగ్గుపడుతునే బ్లవుజ్‌లో దాచిన లేఖను తీసి రవి చేతిలో వుంచింది.

ఉత్తరం మడత విప్పి మొదటి రెండు వాక్యాలు చదవగానే రవి ముఖం మారిపోయింది. ఆశ్చర్యంతో అతని భ్రుకుటి ముడి పడింది. "ప్రతి రోజూ మా కాలేజీ వద్ద కనిపించేవాడు! నా కోసం నన్ను చూడాలని వస్తున్నాడని తెలియదు... ఓ రోజు చెప్పల్ స్టోర్‌లో మాట్లాడానుకూడా మంచి వాడిలా తోచాడు... నా తత్వం అర్థం చేసుకున్నాడు ... ఉత్తరం చూడు యెంత స్వీటీగా వుందో ... ఎలాగైనా ... మంచివాడని నీకు తోస్తే ..." మాటలు దొర్లక ఆగిపోయింది వసుమతి.